సినిమా గ్లామర్

వాణిశ్రీ

ఆడవాళ్ళ గేట్లో నిలబడి సినిమాకు వచ్చే ఆడవాళ్ళని నిశితంగా చూస్తూ గుటకలు మింగుతున్నాడు హాలు మేనేజర్ కాశీపతి.

బుకింగ్ అయిపోయే వరకూ అక్కడే కాలక్షేపం చేసి ఎరవేస్తుంటాడు. అతని ఎరకు చిక్కేది చేపలు ఎక్కువగా కంపెనీ సరుకే అయినా అప్పుడప్పుడూ కుటుంబ స్త్రీలు కూడా మోజుపడడం వున్నది.

కాశీపతి దూరంనుంచే ఆమెను చూసి పొంగిపోయాడు. రెప్పలు కొట్టడం మానేసి అలా చూస్తుండిపోయాడు.

ఆమె పేరు తులసి. ఆ వూరికి కొత్తగా వచ్చింది. ఎక్కడ్నుంచి వచ్చిందో తెలీదు. ఆమె వెంట సుబ్బారావు వున్నాడు. అతను అన్నపూర్ణా హోటల్లో సర్వర్ గా చేరాడు. 'మా ఇద్దరికీ పెళ్ళయి ఆర్నెల్లయిందని' తులసి చెప్పుకుంటుంది. కాని ఇంట్లోంచి లేచిపోయి వచ్చారని చాలామంది సందేహిస్తున్నారు. అందుకు కారణాలు

కొన్ని వున్నాయి.

పెళ్ళయిన పిల్లయితే భర్తకి ఉద్యోగం దొరికాక వస్తుంది. కాని వీళ్ళ విషయంలో అందుకు భిన్నంగా జరిగింది. ఇద్దరూ కలిసే వచ్చారు. చిన్న వూరిల్లు అద్దెకు తీసుకున్నారు. తర్వాత సుబ్బారావు వారంరోజులపాటు ఉద్యోగం కోసం తిరిగాడు. ఆఖరికి హోటల్లో సర్వర్‌గా చేరాడు.

కాశీపతి అనుమానం గూడా లేచిపోయి వచ్చిందనే. అతనికి తులసిమీద ఇంట్రెస్టు కలగడానికి కొన్ని కారణాలున్నాయి. వాళ్ళుంటున్న వూరిల్లు సినిమా హాలుకి దగ్గరగా వుండడంవల్ల, అతను హాలుకి వస్తూ పోతూ వున్నప్పుడల్లా తులసి మెరుపుతీగెలా అతన్ని ఆకర్షించింది. ఆ లొకాలిటీలో వున్న ఆడవాళ్ళు యెక్కువగా చెడిపోయిన వాళ్ళేనని అతని విశ్వాసం.

అదీకాక కాశీపతికి తన పర్సనాలిటీమీద బోలెడు నమ్మకం. తను సిన్సియర్‌గా ట్రై చేస్తే ఏ ఆడపిల్లనైనా బోల్తా కొట్టించగలనన్న విశ్వాసం అతనికుంది. అతను ట్రై చేసినా చిక్కని కేసు గురించి తను సిన్సియర్‌గా ట్రై చెయ్యలేదని అనుకుని సంతృప్తిపడుతుంటాడు.

తులసి టిక్కెట్ కోసం క్యూలో నిలబడింది. కాశీపతికి గుండె విలవిల లాడింది. తను తల్చుకుంటే ఆమెను బాల్కనీలో ఫ్రీగా కూర్చోబెడతాడనే సంగతి గ్రహించినట్లు లేదు. లేకపోతే టిక్కెట్టు కోసం జనం మధ్యలో తోసుకోవడం ఏం ఖర్మ?

తులసి టిక్కెట్టు తీసుకుని గేటు దగ్గరకు రాసాగింది. ఆమె అందం కాశీపతిని వెర్రివాడిని చేస్తోంది. పిచ్చివాడిలా ఒకటే చూపు.

తులసికి ఇరవై ఏళ్ళు లోపు వుంటాయి. యెత్తుగా ఉంటుంది. ఎత్తుకి తగ్గ లావు. కోల ముఖం. తెల్లగా ప్రకాశవంతమైన ఆమె కళ్ళు ప్రత్యేక ఆకర్షణ. ఆమె కర్లింగ్ హెయిర్ మరొక ప్రత్యేకత. ఆమె వంటిమీద బంగారం లేకపోయినా శరీరమంతా బంగారుపూత పూసినట్లుంటుంది ఛాయ.

"ఏంటి గురూ? కళ్ళు మర్చిపోయి చూస్తున్నావ్?" సినిమా రిప్రజెంటేటివ్ భాస్కర్ పలకరించాడు.

అప్పటికి తులసి గేటు దగ్గర టిక్కెట్ ఇచ్చి హాల్లోకి వెళ్ళిపోయింది.

"చూశావా దాన్ని?" అన్నాడు కాశీపతి.

"ఊఁ...."

"ఎట్లా వుంది?"

"నీ ఫేవరెట్ స్టార్ హేమమాలినిలా" వుంది.

"ఛా....! హేమమాలిని గూడా దీనిముందు దిగదుడుపే" అన్నాడు.

"అఫ్ కోర్స్! హేమమాలిన్ని నేనెప్పుడూ పర్సనల్‌గా చూళ్ళేదు. నువ్వు చూశావు కాబట్టి ఒప్పుకుంటాను."

"ఇంతకీ ఆ సుబ్బిగాడు అదృష్టవంతుడు" అన్నాడు కాశీపతి నిట్టూరుస్తూ.

"సుబ్బిగాడెవడు?"

"దాని మొగుడు."

"ఆ పిల్లకి అప్పుడే పెళ్ళయిపోయిందా?" ఆశ్చర్యపోయాడు భాస్కర్.

"పెళ్ళయిందో లేదోగాని సంసారం మాత్రం చేస్తోంది" నవ్వాడు కాశీపతి.

"లేపుకొచ్చాడా ఏం?"

"ఏమో? నిజం యెవరికీ తెలీదు" అంటూ తనకు తెలిసిన సంగతులన్నీ చెప్పాడు కాశీపతి.

అంతా విని "ట్రైచేసి చూడరాదూ?" అన్నాడు భాస్కర్.

"కుదిరి చావడంలేదు గురూ!" అని వాపోయాడు కాశీపతి.

"కుదిరేదేమిటి గురూ! గేట్లో కుర్రాడితో కబురు చెయ్యి. వచ్చి వాలుతుంది. తేలిగ్గా" అన్నాడు భాస్కర్.

"అంత ఈజీగా వస్తుందంటావా?"

"ఎందుకు రాదూ!"

"ఎందుకో వుంది? డబ్బుకి లొంగే రకం కాకపోతే?" భాస్కర్ నవ్వాడు. "పిచ్చివాడా! మనకి సినిమా గ్లామర్ వుంది. అదే వాళ్ళని లాక్కొచ్చి మనముందు పడేస్తుంది. ఈ రోజుల్లో సినిమా మేనేజర్ అంటే గొప్ప. వెయ్యి రూపాయలు ఇచ్చినా రాని ఆడది సినిమావాడ నేసరికి మోజుపడి వస్తుంది. నాకు ఇటువంటివి ఎన్నో కేసులు తెలుసు" అన్నాడు భాస్కర్.

కాశీపతి కూడా భాస్కర్‌తో ఏకీభవించాడు. తన పర్సనాల్టి కొంత, ఈ సినిమా గ్లామర్ కొంత ఆడవాళ్ళ వేటలో వుపయోగపడుతున్నాయని అతనికి తెలుసు.

కాశీపతి మనసులో మనసులేదు. తను ఇన్నాళ్ళూ కాలం వృధాచేసినందుకు విచారించాడు. భాస్కర్ చెప్పినట్లు ఏ కుర్రాడితో కబురు చేసినా సరిపోయేది అనుకున్నాడు.

బుకింగ్ క్లోజ్ చేసి కలెక్షన్ క్యాష్ చెస్టులో

పదేశాడు. టిక్కెట్ పీస్‌లు టాలీ అయ్యాయో లేదో చూడమని అసిస్టెంట్‌కి అప్పగించాడు. మామూలుగా అయితే ఇంటర్వెల్ తర్వాత భోజనం చేసేవాడు. ఆ రోజు ముందే భోజనం ముగించాడు. రిప్రజెంటెటివ్ రూమ్ హాలుకు కొంచెం దూరంలో వుంది. ఆ రూమ్ తాళంచెవి అడిగి తీసుకున్నాడు.

"గుడ్ లక్ గురూ!" అన్నాడు భాస్కర్.

కాశీపతి నవ్వి "థాంక్స్" అన్నాడు.

వాల్ పోస్టర్లు అంటించే భీమరాజుని తనవెంట తీసి కెళ్ళాడు. మేనేజర్ ఎందుకు తనని వెంట రమ్మన్నాడో వాడికి అర్థం కాలేదు. భోజనానికి ముందు బీరుసీసా తెమ్మని పంపించడం మామూలు. కాని ఈ రోజు భోజనం అయిపోయిందే? మరెందుకు? అని ఆలోచించి వాడికి సమాధానం దొరక్క వూరుకున్నాడు.

రూమ్ తాళంతీసి ఫ్యాన్ వేసుకుని మంచంమీద కూర్చున్నాడు కాశీపతి. భీమరాజు గుమ్మంలోనే నిల్చు న్నాడు.

"ఒరేయ్ రాజూ!"

"సార్!"

"నీకు సుబ్బారావు తెలుసుగదా?"

"ఏ సుబ్బారావు సార్?"

"అదేరా అన్నపూర్ణా హోటల్లో సప్లయిర్‌గా చేరాడు చూడు. సన్నగా పొడుగ్గా వుంటాడ్రా!"

భీమరాజు ఆలోచనలో పడ్డాడు.

"మన హాలుకి దగ్గర గుడిసెల్లో వుంటార్రా వాళ్ళు. ఈ మధ్యనే వచ్చారు" అని వివరంగా చెప్పాడు కాశీపతి.

"వాళ్ళా! ఆ సుబ్బారావా? తెలుసు సార్. గుర్తొచ్చాడు" అన్నాడు భీమరాజు.

"వాడి పెళ్ళాం తెలుసా?"

"చూశాను సార్! ఎప్పుడూ మాట్లాళ్లేదు."

"ఇప్పుడు మాట్లాడు."

"ఎందుకు సార్!" కొంచెం ఆశ్చర్యపోయాడు. మేనేజర్ మనసులో ఏముందో వాడికి లీలగా తోస్తోంది.

"అది సినిమాకి వచ్చిందిరా! బెంచీలో కూర్చుంది. ఇంటర్వెల్లో అది బైటకు వస్తుంది. వీలుచూసి పలకరించు. దాని పేరు తులసి. 'మీ పేరు తులసిగదా అను' అవు నంటుంది. మాటల్లో పెట్టి అసలు సంగతి చెప్పు. మా మేనేజర్ మీరంటే ఇష్టపడుతున్నాడు. ఫలానాచోట వున్నాడు. ఒకసారి రమ్మన్నాడు. సినిమా అయేలోపల వెళ్ళిపోవచ్చు అని చెప్పు. నువ్వు రోడ్డుమీద కాచుకో. బైటకు వచ్చాక వెంటపెట్టుకుని ఇక్కడకు తీసుకురా."

కాశీపతి వాడిచేతికి ఐదు కాగితం ఇచ్చాడు. భీమరాజు దాన్ని పేంట్ జేబులో వేసుకున్నాడు.

"వస్తుందా సార్!" అనుమానంగా అడిగాడు.

"వస్తుంది" అన్నాడు కాశీపతి.

భీమరాజు ఈల వేసుకుంటూ బైల్దేరాడు.

2

"ఏమండీ...." అన్నాడు భీమరాజు.

తులసి వింతగా చూసింది.

"మీ పేరు తులసిగదూ!" అన్నాడు.

"అవును. నీకెట్లా తెలుసు?" ఆశ్చర్యంగా చూసింది. తులసి.

భీమరాజు నవ్వాడు.

"మా ఆయన పేరు సుబ్బారావు."
"అరె. భలే తెలుసుకున్నావే?"
"అన్నపూర్ణా హోటల్లో సప్లయర్."
"నా గురించి, అంతా తెలుసన్నమాట."
"హూఁ...." అన్నాడు భీమరాజు గర్వంగా.

"అసలు నువ్వెవరు?" తులసి గొంతు కఠినంగా ఉండడం చూసి భీమరాజుకి కలవరం కలిగింది.

"నేనీ హోల్లో పని చేస్తున్నాను."
"ఏం కావాలి నీకు?"
"నాకేం అక్కర్లేదు."
"మరి?"
"మా మేనేజర్ తెలుసా మీకు?"
"మీ మేనేజరా?"
"హూఁ...."
"ఏం పేరు?"
"కాశీపతి."
తులసి కొన్ని క్షణాలు ఆలోచించి "తెలీదు" అంది.
"మీరు ఆయనకి బాగా తెల్సు."
"అట్లాగా!"
"మీరంటే ఎంతో ఇష్టమని చెప్పారు."
"అట్లాగని నీకు చెప్పాడా?"
"అవును. నన్ను ఆయనే పంపాడు."
"ఎందుకు?"
భీమరాజు నవ్వాడు.
"నవ్వుతావెందుకు?"
"మగాడు ఆడదాన్ని రమ్మని యెందుకు పిలుస్తాడు?

అందుకే. దగ్గర్లో నే రూమ్ వుంది. అందులో వున్నాడు. మీ కోసం యెదురు చూస్తున్నాడు. సినిమా అయిపోయే లోపలే పంపించేస్తాడు" అన్నాడు భీమరాజు.

"ఒరేయ్!"

ఉలిక్కిపడ్డాడు భీమరాజు.

తులసి ముఖం యెరుపెక్కింది. కళ్ళు పెద్దవిచేసి చూస్తూంటే వాడి గుండె దడెక్కింది.

"నీకు పుల్లమ్మ కంపెనీ తెలుసా?"

"తెలుసు."

"అక్కడికెళ్ళి ఒక లంజను పిల్చుకెళ్ళరా వెధవా! డాఫర్ లంజాకొడకా! ఈసారి నా కంటికి కనిపించా వంటే చెప్పుతో కొడతాను" గట్టిగా అంది తులసి.

అనడమే కాదు. జుట్టు పట్టుకుని వంగదీసి నాలుగు గుద్దింది.

ఇంటర్వెల్లో వరండాల్లో సమోసాలు తింటున్న వాళ్ళు, చాక్లెట్లు చప్పరిస్తున్నవాళ్లు, టీ నీళ్ళు తాగు తున్నవాళ్ళూ యెక్కడి వాళ్ళక్కడ నిలబడిపోయి ఆ సీన్ చూశారు.

"ఈసారి చెప్పుతో కొడతాను, నిన్నూ వాడిని గూడా!" అంది తులసి.

భీమరాజు తులసి పట్టు వదిలించుకుని స్పీడుగా పారి పోయాడు.

ఏం జరిగిందో అడిగే లోపల తులసి హాల్లోకి వెళ్ళి పోయింది. జరిగిపోయిన రసవత్తర ఘట్టానికి కారణం యేమిటో యెవరికీ తెలీలేదు. ఈ లోపల బెల్ కొట్టారు. ఎక్కడి వాళ్ళక్కడ తేరుకుని హాల్లోకి వెళ్ళిపోయారు.

3

ఆఫీస్ రూమ్‌లో కూర్చున్న మేనేజర్ని చూసి రిప్ర జెంటేటివ్ ఆశ్చర్యపోయినట్లు నిలబడిపోయాడు.

కాశీపతి ముఖం అవమానంతో కుతకుత వుడికిపోతున్నది. అప్ట్రాల్ ఒక ఆడది, అందులోనూ ఒక సర్వర్‌గాడి పెళ్ళాం తనని చెప్పుతో కొడతానని నలుగురిలో పరువు తీసింది. తను పంపినవాడిని వాయగొట్టింది. ఎంత ధైర్యం దానికి? దానిని ఏం చేస్తే తన కసి తీరుతుంది?

"కూర్చో గురూ!" అన్నాడు కాశీపతి కొంచెం సేపటికి తేరుకుని.

భాస్కర్ కూర్చున్నాడు.

"మూడ్లో పార్టు గూడా అయినట్లు లేదు. అప్పుడే వచ్చేశావేమిటి? అది వచ్చిందా?"

కాశీపతి తల అడ్డంగా వూపాడు.

"కథ అడ్డం తిరిగింది."

అతను జరిగినదంతా వివరంగా చెప్పాడు భాస్కర్‌కి.

"అయితే అది హై లెవల్లో వుందన్నమాట" అన్నాడు భాస్కర్.

"నువ్వు చెప్పినట్లు సినిమా గ్లామర్ పనిచెయ్యలేదు దానిముందు" నీరసంగా అన్నాడు కాశీపతి.

"ఆ మాట నేనొప్పుకోను" అన్నాడు భాస్కర్.

"నీకింకా ఆ గ్లామర్ మీద నమ్మకం వుందా? అయితే ఈ కేసు ఎందుకు ఫెయిలయినట్లు?" అన్నాడు కాశీపతి, భాస్కర్ ధోరణి అర్థంకాక.

"ఈ కేసు హై క్లాస్."

"అంటే."

"అంటే యేముంది? రాయబారాలు, సందేశాలవల్ల లాభం లేదు. పర్సనల్ గా డీల్ చెయ్యాలి బ్రదర్" అని పకపక నవ్వాడు భాస్కర్.

కాశీపతి తెల్లబోయి చూశాడు.

"నీకు ఆడదాని సైకాలజీ తెలీదు బ్రదర్. మనం యెవరికి కబురు చేస్తాం? కాల్ గర్ కి. తనని ముక్కూ మొఖం తెలీనివాడు రమ్మని పిలిచాడంటే తనని కాల్ గర్లుగా దిగజార్చాడని అది అర్థం చేసుకుంది. అది చాలా ఇంటలిజెంట్. ఎడ్యుకేటెడ్ కూడా అయివుంటుంది. అందుకే మనవాడిని దులిపేసింది. పర్సనల్ గా ట్రైచేస్తే లొంగకపోదు. ఈసారి రాయబారం పంపక. స్వయంగా ట్రైచేసుకో. సక్సెస్ గ్యారంటీ."

కాశీపతి మనసు వూరట చెందింది. ఆశ చిగురించింది తులసిమీద.

'అమ్మ దొంగ! ఇంత ఘటికురాలివా? నిన్ను పడ వెయ్యకపోతే నా పేరు కాశీపతే కాదు' అనుకున్నాడు.

"థాంక్స్ గురూ!" అన్నాడు కాశీపతి భాస్కర్ వంక కృతజ్ఞతతో చూస్తూ.

4

తులసి వుంటున్న లొకాలిటీని కాకులగుంట అంటారు ఆ వూళ్ళో. ఒకప్పుడది గుంటగా వుండేది. చెడిబ్రతికిన వాడొకడు ఆ యేరియాని మున్సిపాలిటీనుంచి ఆక్రమణచేసి పది పాకలువేసి అద్దెలకిచ్చాడు.

ఆ చుట్టుపక్కల మరికొన్ని పాకలు వెలిశాయి. మున్సిపాలిటీవాళ్ళు చచ్చినట్లు లైట్లు వేశారు, కుళాయిలు పెట్టించారు. అదంతా నా గొప్పే అంటాడు ఆ చెడి బ్రతుకుతున్నవాడు. అందుకే అతన్ని కౌన్సిలర్ గా

యెన్నుకున్నారు ఆ వాడలో వాళ్ళు. అతని పేరు ఏడు కొండలు.

కాశీపతి ఏడుకొండల్ని కలిశాడు.

"నమస్కారం మేనేజరుగారూ! యేవిటిలా దయ చేశారు. యెవ్వారం చూస్తే దారితప్పి వచ్చినట్లుందే" అన్నాడు పకపక నవ్వుతూ.

"అదేం కాదు. దారి చూసుకునే వచ్చాను."

"ఏవిటి సంగతి?"

"మరేంలేదు. మా హాలుదగ్గర మీ ఇళ్ళున్నాయిగా."

"వున్నాయి. కొంపతీసి పీకించెయ్యమన్నా రేవిటి? పిల్లలు గలవాణ్ని."

"అబ్బ చెప్పనియ్యండి స్వామీ! ఆ ఇళ్ళలో నాకొకటి కావాలి."

"మీ కేవిటి? ఆ లోకాల్టీలో ఇల్లేమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు యేడుకొండలు.

"ఫ్యామిలీ వుంటానికి కాదు లెండి. ఒకోక్కసారి రెండో ఆట అయ్యేవరకూ వుండాల్సొస్తున్నది. గవర్న మెంట్ మారిందిగదా! సేల్ టాక్సొళ్ళనీ, ఇన్ స్పెక్టర్లనీ, అళ్ళూ ఇళ్ళూ వస్తుంటారని మా ప్రొప్రయిటర్ నన్ను జాగ్రత్తగా వుండమన్నాడు. తప్పదుగదా మరి?

ఆ టైమ్‌లో ఇంటిదాకా పోవాలంటే కష్టంగా వుంది. యెక్కడో కొత్తపేటలో. హాల్దగ్గిరే ఇల్లు తీసుకుంటే మంచిదని. దగ్గరగా వుంటుంది. మనం సెకండ్ షో ఇంటర్వెల్ అయ్యాక వచ్చి పడుకోవచ్చు. యెవరైనా చెకింగ్ కివస్తే వర్రాళ్ళొచ్చి గబుక్కున లేపుతారు."

తనకి అక్కడ ఇల్లెందుకు కావాలో వివరంగా

చెప్పాడు కాశీపతి.

"మీరడిగితే నేను కాదంటానా? ఇల్లు రెడీగా వుంది. ఆకుపచ్చ తలుపులున్నది. ఇదుగో తాళంచెవి తీసుకోండి. మీ తాళం వేసుకున్నాక మాది పంపించండి" అన్నాడు యేడుకొండలు.

తాళంచెవి అందుకుని "అద్దె ఎంత?" అన్నాడు.

"అద్దెది యేవుందిలెండి. యెంతో కొంత ఇవ్వండి. మీ సినిమా ఫ్రీగా చూస్తుంటారుగా మా పిల్లలు" అని నవ్వాడు యేడుకొండలు.

"అది వేరు. ఇది వేరు. అద్దె చెప్పండి."

"అందరూ ముప్పై ఇస్తున్నారు. మీరు ఏభై ఇవ్వండి."

"అదేవిటి?"

"మీరు సినిమా మేనేజర్‌గా అందుకని."

కాశీపతి నవ్వాడు.

అతని కళ్ళముందు తులసి కదులాడుతోంది. తను ఆ లోకాలిటీలో ఇల్లు తీసుకుంటున్నది కేవలం తులసికోసం.

మర్నాడే ఆ ఇంట్లో చేరాడు కాశీపతి. సినిమా మేనేజర్ తమ ఇళ్ళమధ్య చేరడం అక్కడివాళ్ళకి చాలా ఆశ్చర్యంగా వుంది. హాలుకి దగ్గరగా వుంటుందని తీసుకున్నానని అడిగిన వాళ్ళకి చెప్పాడు.

కొందరు ఆడవాళ్ళు అతన్ని బుట్టలో వేసుకోవాలని ప్రయత్నాల్లో పడ్డారు. కాని అతని దృష్టి తులసిమీద వుందని గ్రహించి నిరాశపడ్డారు. తులసి ఇంటి బైటకు వస్తే కాశీపతి కళ్ళు రెప్పలు వెయ్యకుండా చూసేవాడు. సుబ్బారావుతో మాటలు కలపడానికి ప్రయత్నించేవాడు.

సుబ్బారావు కలుపుగోలు మనిషి కాదు. ఇంటర్ వరకు చదువుకుని హోటల్లో సర్వర్‌గా వుండాల్సొ

చ్చిందని బాధపడుతూ, ఇన్ ఫీరియారిటీ కాంప్లెక్స్ తో కృంగిపోతుండేవాడు.

"మీకు వీలుగా వుంటే మా హాల్లో బుక్కింగ్ చెయ్యండి. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడుగా వుంటుంది" అన్నాడొకసారి సుబ్బారావుతో.

"ఎక్కడ కుదురుతుందండీ? షిఫ్టుల ప్రకారం పని చెయ్యాలిగదా! ఒక రోజు పగలు, మరోక రోజు రాత్రి వస్తుంటుంది డ్యూటీ" అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావుని తన కంట్రోల్లోకి తెచ్చుకోవాలను కున్న కాశీపతి ఐడియా ఫలించలేదు.

కాని రాను రాను తులసి ప్రవర్తనలో మార్పు కని పించింది. లోగడలా కాశీపతిని చిన్న చూపు చూడటం లేదు. ప్రసన్నంగా చూడడం సాగించింది. అతను నవ్వితే సిగ్గుపడడం, పమిట సర్దుకోవడం, యెవరైనా గమనిస్తు న్నారేమోనని అటూ ఇటూ చూడడం చేస్తోంది.

కాశీపతి తన కష్టం ఫలించేరోజు దగ్గరపడుతున్నట్లు గ్రహించాడు.

ఒక రోజు మధ్యాహ్నం.

తులసి ఎండిన బట్టలు తీసి మడతలు వేస్తోంది.

కాశీపతి ట్రిమ్‌గా తయారై హాలుకి బయల్దేరాడు. మ్యాట్నీ టైమ్. కాబోతున్నది. ఆ వేళ కొత్త సినిమా మొదలు.

"సుబ్బారావుగారు లేరా?" అన్నాడు కాశీపతి ఇంటిముందు ఆగి.

తులసి అతన్ని గమనించి కంగారుపడింది. పమిట సర్దు కుంది. అతని కళ్ళలోకి సూటిగా చూసి కళ్ళు దించు

కుంది.

"లేరండి. డ్యూటీకి వెళ్ళారు" అంది.

"ఎప్పుడొస్తారు?"

"రాత్రి ఎనిమిదికి."

"అప్పటి వరకూ మీరు ఒంటరిగా యెలా వుంటారు? బోర్ కొట్టదూ?"

ఆమె సమాధానం చెప్పలేదు. మొగమాట పడుతూ నవ్వింది. ఆమె కళ్ళు ఇటూ ఇటూ కదులుతున్నాయి యెవరైనా చూస్తున్నారేమోనని. కాని ఆ సమయంలో యెవరూ బైట లేరు. యెండకి ఇళ్ళల్లో వున్నారు.

"మీతో ఒక విషయం మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడు.

ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

అతను చొరవగా ఇంట్లోకి వెళ్ళాడు.

"ఎండ దంచేస్తున్నది. లోపలికి రండి" అన్నాడు.

ఆమె లోపలకు వచ్చింది. తాటాకుల ఇంట్లో చల్లగా వుంది.

"కాసిని మంచినీళ్ళు ఇస్తారా?"

ఆమె మంచినీళ్ళు ఇచ్చింది. అతను కావాలని గ్లాసు ఇస్తున్నప్పుడు ఆమె వేళ్ళు ముట్టుకున్నాడు. ఆమె కళ్ళెత్తి చూసి సిగ్గుపడింది. అతను గ్లాసు ఖాళీచేసి ఆమెకు ఇచ్చాడు.

"ఆ రోజు మా కుర్రాడిని యెందుకు కొట్టారు?" సూటిగా ప్రశ్నించాడు.

"నాకు కోపం వచ్చింది. అలా కబురు చెయ్యడంలో మీ వుద్దేశ్యం ఏమిటి? నేను నీతిమాలిన దానిననుకున్నారా?" కోపంగా అంది.

"అలా కోప్పడకండి. పొరపాటు జరిగింది. ఒప్పుకుంటున్నాను. ఇష్టం లేకపోతే రానని చెప్పొచ్చుగదా! కొట్టడం యెందుకు?"

"చెప్పానుగా కోపం వచ్చిందని. అలా కబురు చెయ్యడానికి మీకెంత ధైర్యం. యెందుకు చేశారు అలా?"

"మీ గురించి కొందరు అలా చెప్పారు. అందుకని కబురు చేశాను."

"ఎవరా కొందరు?"

"పేర్లెందుకు లెండి" అన్నాడు నిట్టూరుస్తూ.

ఆమె ముఖంలో కోపం పోయింది.

"మీరు చాలా అందంగా వుంటారు. నా ఫేవరెట్ హేమమాలిని. మీరు అలాగే వుంటారు."

ఆమె సిగ్గుపడింది.

"పొగడకండి" అంది.

"కొత్త సినిమా వచ్చింది. రండి మ్యాట్నీకి. అనవసరంగా టిక్కెట్ కొంటారెందుకు? సరాసరి వెళ్ళి బాల్కనీలో కూర్చోండి."

ఆమె ఇబ్బందిగా చూసింది.

"మాట్లాడరేమిటి? వస్తారా?"

"ఇప్పుడు కాదు లెండి."

"ఫరవాలేదు లెండి."

కాశీపతి ధైర్యంచేసి ఆమె చేతిని మృదువుగా తన చేతిలోకి తీసుకున్నాడు. ఆమె ఇబ్బందిగా చూస్తూ తన చేతిని విడిపించుకుంది. అతను మరింత ముందుకు పోయి ఆమె నడుం చుట్టూ చేతిని వేసి దగ్గరగా లాక్కున్నాడు.

అంతే!

అతని గూబ 'గుయ్' మంది.

ఒక్క తోపుతో వాకిట్లోకి వచ్చి పడ్డాడు.

"ఎవర్రా నువ్వు? దొంగ వెధవా? మర్యాదస్తుడ వనుకున్నాను. మగాళ్ళు లేనప్పుడు కొంపలోకి జొరపడి మీద చెయ్యి వేస్తావా? చెప్పుతో కొడతాను వెధవా?"

తులసి కాళికలా మహోగ్రంగా విరుచుకుపడింది.

కాశీపతి ఖిన్నుడై పోయాడు.

ఆ వాడలో ఆడ, మగా విస్తుపోయి చూస్తుంటే అతని తల అవమానంతో వాలిపోయింది. సిగ్గుతో ముఖం ఎత్తలేక ఎలాగో అక్కడ్నుంచి బైటపడి హోటల్లోకి వెళ్ళిపోయాడు. ఆ షాక్ నుంచి కోలుకోవడానికి చాలా సేపు పట్టింది అతనికి.

5

కాశీపతి పుట్టాక అటువంటి షాక్ ఎప్పుడూ తిన లేదు. అదీ పదిమందిలో, చెప్పుతో కొట్టడం తప్ప అంత పనీ చేసింది ఒక ఆడది. అదీ ఒక బక్కవాడి పెళ్ళాం. అంత అవమానం భరించడం తనవల్ల కాదనిపించింది అతనికి.

రిప్రజెంటేటివ్ తో చెప్పుకుని దాదాపు కన్నీళ్ళు పెట్టు కున్నాడు. ఆ లొకాల్టీలో మగ, ఆడ రేపు వూరంతా ప్రచారం చెయ్యరా? ఇక తన పరువు బజార్న పడ్డట్లే అని వాపోయాడు. ప్రొప్రయిటర్ కి తెలిస్తే తనని చీవాట్లు పెడతాడని భయం వ్యక్తం చేశాడు.

ఒకవైపు ఇంకా బుక్కింగ్ జరుగుతుండగానే కుర్రాడ్ని పంపించి విస్కీ బాటిల్ తెప్పించి తాగడం మొదలు పెట్టాడు. రిప్రజెంటేటివ్ ని బలవంతం చేశాడు తాగమని.

"సారీ గురూ! డ్యూటీలో తాగను. ఎవరైనా ఇన్

స్పెక్టర్ వస్తే ఉద్యోగం వూడుతుంది" అన్నాడు.

రిప్రజెంటేటివ్ గేట్లు చూసుకుంటూ బైట వుండి పోయాడు. కాశీపతి ఆఫీస్ రూమ్‌లో కూర్చుని ఒంటరిగానే మందు కొడుతూ వున్నాడు.

ఇంటర్వెల్ అయింది.

ఒక్కడే హాఫ్ బాటిల్ ఖాళీ చేశాడు కాశీపతి. భోజనం చేసి మత్తుగా కూర్చున్నాడు. అంత తాగినా అతనికి తులసి జ్ఞాపకం రావడం మానలేదు. తిట్టుకుంటూ కూర్చున్నాడు.

మొదటి ఆట వదిలే టైమ్ అయింది.

అప్పుడు వచ్చాడు సుబ్బారావు కేకలు రంకెలు పెడుతూ. అతని వెంట పదిమందివరకూ వున్నారు ఆ లోకాలిటీ లో జనం.

సుబ్బారావు బూతులు తిడుతూ ఆఫీసులోకి వచ్చాడు. సినిమా హాల్లో స్టాఫ్ అతన్ని పట్టుకుని ఆపారు.

కాశీపతికి అతన్ని చూడగానే కోపం ముంచుకొచ్చింది. సుబ్బారావుని యెడా పెడా వాయించాడు.

"ఈసారి వచ్చావంటే చంపుతాను కొడకా! కాశీపతి అంటే లోకువైందా?" అని తిట్టాడు.

సుబ్బారావు వెంట వచ్చిన వాళ్ళు కాశీపతిని పట్టుకోబోయారు.

"వంటిమీద చెయ్యివేస్తే చంపుతానని" మండిపడ్డాడు కాశీపతి.

వాళ్ళు వెనక్కి తగ్గారు. స్థానబలిమి. ఏం చెయ్యలేక తలా ఒక మాట అనిపోయారు.

సుబ్బారావు బూతులు తిట్టి నీ సంగతి తేలుస్తా అని వెళ్లాడు.

ఆ వెళ్ళినవాడు ఇంటికి వెళ్ళలేదు. పోలీస్ స్టేషన్ కి వెళ్ళి కాశీపతిమీద రిపోర్టు ఇచ్చాడు, తను ఇంట్లో లేని సమయంలో వచ్చి తన భార్యను బలాత్కారం చేశాడని.

6

మర్నాడు పోలీసులు ఇద్దరు కాశీపతి ఇంటికి వచ్చి సెల్యూట్ కొట్టారు.

"ఏమిటిలా వచ్చారు?" అన్నాడు కాశీపతి నవ్వుతూ.

"మా యస్.ఐ.గారు రమ్మన్నారు సార్!"

"ఎందుకు? ఏమిటి?" అని ప్రశ్నించలేదు కాశీపతి.

"నేను వస్తున్నాను పదండి" అన్నాడు.

పోలీసులు వెళ్ళిపోయారు.

"ఎందుకు పోలీసులు వచ్చారు?" ప్రశ్నించింది కాశీపతి భార్య లలిత.

"మనతో ఏదో పని వుండి వుంటుంది" అన్నాడు.

"మనతో పనుంటే యస్.ఐ. మన ఇంటికే వచ్చి వుండేవాడు కదా!" అంది లలిత వ్యంగ్య ధోరణిలో.

"అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి?" కోపంగా చూశాడు.

"దాని మొగుణ్ని పోలు దగ్గర కొట్టారంటగా."

"దేని మొగుణ్ని?"

"దానికోసం ఇల్లు గూడా అద్దెకు తీసుకుని వున్నారుగా? ఏదో తెలీదా?"

"నీకెవరు చెప్పారు?"

"ఇటువంటివి దాగుతా యా దాచాలనుకుంటే మాత్రం?"

ఆమె వ్యంగ్యం అతనికి సూటిగా తగులుతోంది.

"సర్లే నోరు మూసుకో" అని విసురుగా వెళ్ళిపోయాడు.

యస్. ఐ. ప్రభాకర్ అతన్ని ఆహ్వానించి కూర్చోబెట్టాడు.

"ఏమిటి రాత్రి ఏదో గొడవ జరిగిందట పాలు దగ్గర?" యేమీ యెరగనట్లు అడిగాడు యస్.ఐ.

"ఏం లేదు సార్! రెండు నెల్లనుంచీ తులసి నా దగ్గరకు వచ్చి పోతూనే వుంది. మీకు తెలుసో లేదో, దానింటి దగ్గరే ఇల్లు కూడా తీసుకున్నాను. కాకుల గుంటలో ఇల్లు పక్కనే వుంటే కొంచెం నయంకదా!"

"ఐ సీ...." అన్నాడు యస్.ఐ.

"నిన్న మధ్యాహ్నం నేను దాని ఇంటికి వెళ్ళాను. యేమిటో అలా బుద్ధి పుట్టింది నాకు. పగలు పోవడం తప్పే అనుకోండి. అందుకే గొడవవచ్చి పడింది. ఎవడో అది చూసి నలుగుర్నీ పోగేశాడు. ఇక అది కంగారుపడి నన్ను తిట్టి బెటకు నెట్టేసింది. అందరికీ తెలిసిన సంగతి మొగుడికి తెలుస్తుందని భయపడి వాడికి నామీద చెప్పింది బలవంతం చేశానని. అదీ కథ. ఆ పిచ్చివాడు దాని మాటలన్నీ నమ్మి యేకంగా పాలు దగ్గరికి వచ్చాడు. నాలుగు తగిలించి పంపించాను" అన్నాడు కాశీపతి.

"నలుగుర్లో అంతే యెలా గురూగారూ! అప్పుడే వాడ్ని కట్టిపడేసి హాల్లో గొడవ పెడుతున్నాడని నాకొక ఫోన్ కొట్టివుంటే వెధవని స్టేషన్‌కి పట్టుకొచ్చి చర్మం వలిచేవాడిని కదా! పొరపాటు చేశారు" అన్నాడు యస్.ఐ. విచారం వ్యక్తం చేస్తూ.

"పొరపాటే చేశాను. నేనూ తొందరపడ్డా లెండి. ఆ తులసి చేసిన పనికి షాక్ తిన్నాను. లేకపోతే ఏమిటి చెప్పండి. రెండు నెలల్నుంచీ నా పక్కలో పడు కుంటున్న మనిషి బలవంతం చేశానని నలుగుర్లో తిట్టడం.

ఛా.... ఛా.... అంతా సినిమాలో జరిగినట్లుయిందనుకోండి. మతి పోయింది దాని దెబ్బకి...." నవ్వాడు కాశీపతి.

యస్. ఐ. కూడా నవ్వాడు.

"ఆ అవమానం భరించలేక మందుకొట్టి పడుకున్నాను. ఇంతలో పెద్ద పోటుగాడిలా ఆ కొడుకు కేకలేసుకుంటూ వచ్చాడు. చెప్పొద్దూ నాకు నసాలానికి అంటింది కోపం. వెనకా ముందూ చూడకుండా నాలుగు తగిలించాను. వాడు మీ కొచ్చి చెప్పుకునుంటాడు" నవ్వుతూ యస్.ఐ. ముఖంలోకి చూశాడు కాశీపతి.

యస్.ఐ. నవ్వలేదు.

"చెప్పడం యేమిటి? రిపోర్టు రాసిచ్చిపోయాడు. కుర్రాడు చదువుకున్నవాడిలాగే వున్నాడు. రూల్సు తెలుసులాగుంది. మీరు గనక కేసుపెట్టకపోతే నేనే ప్రైవేట్ కేసువేస్తానని బెదిరించి పోయాడు. భలే ఇరుకులో పెట్టారుకదండీ" అన్నాడు సీరియస్‌గా.

"ఏదో చూడండి" అన్నాడు కాశీపతి.

"తప్పుతుందా మరి? మీకోసం ఏదోకదారి చూస్తామనుకోండి" అని నవ్వాడు యస్. ఐ.

"నేనిక వెళ్ళిరానా? హాలు దగ్గర కొంచెం పనుంది"

"అలాగే? సాయంకాలం హాలు దగ్గర వుంటారా? వస్తాను."

"ఓ యస్. రండి ఫ్యామిలీతో. నిన్ననే కొత్త ఫిక్చర్ వచ్చింది."

"సినిమాకి తర్వాత వస్తాం లెండి. డ్యూటీమీదే రావాలి."

"డ్యూటీమీదా?"

"అవును సార్!"

"మీరు రావడం యెందుకు? చెప్పండి యేమిటో?"

"ఏం లేదు. ఈ నెలాఖరుకి మా యస్సైగారు రిటైరై పోతున్నాడు. పాపం, సర్వీస్‌లో యేం సంపాదించుకో లేదు. ఇద్దరు కూతుళ్ళున్నారు పెళ్ళికి. మేమంతా కలిసి పర్స్ ప్రెజెంట్ చెయ్యాలనుకుంటున్నాం. మీరొక వెయ్యి వెయ్యాలి."

"అలాగే, రాసుకోండి."

"ఎంత రాసుకోమంటారు?"

"మీకు తెలీదా నా కెపాసిటీ?"

"వెయ్యి నూటపదహార్లు రాస్తున్నాను."

"అమ్మో?"

"భలేవారే. అలా అంటారేమిటి? సినిమా హాలు మేనేజర్ మీరు."

"ఐదొందలు రాసుకోండి."

"లాభం లేదు లెండి, గిట్టదు...."

"సర్లెండి...." అంటూ నీరసంగా వెళ్ళిపోయాడు కాశీపతి లోలోపల తిట్టుకుంటూ.

'వచ్చిన సినిమాలన్నీ ఫ్యామిలీలతో సహా వచ్చి చూసి పోతారు. యెక్కడన్నా కాస్త ఇరుక్కుంటే చాలు నొక్కుతారు డబ్బుకి. విశ్వాసం లేదు. ఈ పోలీసు జాతే అంత!'

7

కావలగుంట యేరియాలో అర్ధరాత్రి తులసి ఇంట్లో నుంచి 'కెవ్వు'న కేక వినిపించింది. ఆ చుట్టుపక్కల ఇళ్ళల్లో వాళ్ళు ఆ కేక విని నిద్రలోనే ఉలిక్కిపడ్డారు. అంత భయంకరంగా వుందా కేక. నిద్రలేచి పరుగులు తీశారు.

అంతా చీకటిగా వుంది. ఆకాశంలో నక్షత్రాల కాంతి తప్ప వెలుగులేదు. మామూలుగా తెల్లవార్లూ వెలుగుతూ వుండే స్ట్రీట్ లైట్లు వెలగడంలేదు.

ఆ కేక ఎవరు పెట్టారో? ఏ ఇంట్లోనుంచి వచ్చిందో కొంచెం సేపటి వరకు యెవరికీ అర్థం కాలేదు. ఏం జరిగిందో అసలే తెలియలేదు.

స్పిన్నింగ్ మిల్లులో వాచ్‌మన్‌గా పనిచేసే తాతారావు బ్యాటరీలైటు వేశాక వెలుగొచ్చింది. ఒకళ్ళ ముఖాలు మరొకళ్ళు చూసుకున్నారు.

అందరి యిళ్ళలోంచి జనం వచ్చారు. ఒక్క తులసి ఇంట్లోనుంచి తప్ప. ఆ ఇల్లు తలుపు మూసివుంది. తలుపు తడితే రాలేదు. లోపల గడివేసినట్లుంది.

తలుపులు బాదినా యెవ్వరూ తియ్యలేదు.

కాబట్టి కేకలు వినిపించింది ఆ ఇంట్లోనుంచే అని తెలుసుకున్నారు. ఏదో జరిగింది అని అర్థమైంది. బ్యాటరీ లైటు వేసుకుని తాతారావు ఆ ఇంటి వెనక్కి వెళ్ళాడు. వెనుక తలుపులు బార్లా తీసి వున్నాయి.

"లోపలకెళ్ళరా తాతారావ్? చూసిరా యేం జరి జరిగిందో?" అన్నారు యెవరో.

తాతారావు స్వతహాగా ధైర్యవంతుడే. కాని ఇప్పటి పరిస్థితి వేరు. అంతకుముందే ఆ ఇంట్లోనుంచి కేకలు వినిపించాయి. ముందు తలుపు మూసివుంది. వెనుక తలుపులు బార్లా తీసివున్నాయి. అంటే యేదో జరిగివుంటుంది. అతని గుండె దడదడలాడింది.

"నేనొక్కణ్ణే వెళ్ళను. వెంట యెవరైనా రండి" అన్నాడు తాతారావు.

నలుగురు మగాళ్ళు అతని వెంట నడిచారు. లైటు

వేసుకుంటూ ముందు తాతారావు లోపలకు ప్రవేశించాడు.

ఆ దృశ్యం చూసి తాతారావు అదిరిపడ్డాడు. తల గిరగిరా తిరిగినట్లయింది. కాళ్ళు చేతులు వణికాయి.

"ఇద్దర్నీ చంపేశారెవరో" అంటూ ఒకడు ముందుకు వెళ్ళి తలుపులు తీశాడు.

"ఇద్దర్నీ పొడిచేశారు" అని కేకలు పెట్టాడు.

జనం బిలబిలమని లోపలకు వచ్చారు.

సుబ్బారావు రక్తం మడుగులో పడున్నాడు. అతని గుండెల్లో కత్తి దిగి పిడి కనిపిస్తోంది. అతని శవం మంచం మీద వుంది.

తులసి చాపమీద పడివుంది. ఆమె తలమీద నెత్తురు, ముఖం ఎర్రగా అయిపోయింది రక్తంతో తడిసి.

సుబ్బారావులో చలనంలేదు. కాని తులసి వూపిరి పీలుస్తోంది. యెవరో ముక్కు దగ్గర వేలుపెట్టి చూశారు. చెయ్యి పట్టుకుని నాడి చూశారు.

"బ్రతికే వుందిరా! రిక్షా పట్టుకరండి. ఆసుపత్రికి తీసుకెళ్దాం" అన్నాడు తాతారావు.

నలుగురు తులసిని మోసుకెళ్ళి రిక్షాలో ఎక్కించారు. తులసిని పట్టుకుని కూర్చోవడానికి ఒక ఆడమనిషిని రిక్షాలో తోడు వుంచారు.

"ఇద్దరెళ్ళి పోలీస్ స్టేషన్ లో చెప్పిరండిరా ఈ సంగతి" అన్నాడొక ముసలాయన.

"ఎవరు పొడిశారో మాయదారి ముండాకొడుకులు. వాళ్ళ దినం చెయ్య రాక్షసులు...." అంటూ ఆడవాళ్ళు తిట్టసాగారు.

బండిమీద పళ్ళు అమ్ముకునే కాశయ్య తన పెట్రోమాక్స్ లైటు వెలిగించి ఆ ఇంటిముందు పెట్టాడు. ఆ

వెలుగులో ధైర్యంగా కూర్చున్నారు ఆ వీధిలో వాళ్ళంతా. యెవరికీ నిద్ర రావడంలేదు. గత కొన్ని రోజులుగా జరుగుతున్న గొడవలన్నీ నెమరు వేసుకుంటూ మాట్లాడు కోసాగారు.

కాపుల గుంటలో చాలామందికి సుబ్బారావు హత్య, తులసి చావుబతుకుల్లో వుండడం గురించి తెలిసిపోయింది. ఒక్కొక్కళ్ళే వచ్చి చూసిపోతున్నారు.

8

తులసి వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

తెలివి వచ్చినప్పట్నుంచి ఆమె ఏడుస్తూనే వుంది.

“తెల్లవారిన తర్వాత ఇన్‌స్పెక్టర్ రామస్వామి, యస్.ఐ. ప్రభాకర్ హాస్పిటల్‌కి వచ్చారు. రాత్రి ఆమె కేస్ టేకప్ చేసిన డ్యూటీ డాక్టర్ అక్కడే వున్నాడు.

“గుడ్ మార్నింగ్ డాక్టర్! ఆమెకు యెలా వుంది?” ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

“షీ ఈజ్ ఆల్‌రైట్. ఆమె తలకు గాయం తగిలింది. గోడకు కొట్టుకుని వుండొచ్చు. అంతకంటే ఇంజరీస్ ఏమీ లేవు. కాకపోతే మెంటల్ షాక్ తిని పడిపోయింది. ఇప్పుడు తెలివిలోనే వుంది. మీరు మాట్లాడవచ్చు” అన్నాడు డాక్టర్.

ఇన్‌స్పెక్టర్ వార్డులోకి వచ్చేసరికి ఆమె చుట్టూ జనం మూగివున్నారు. యస్.ఐ. అందర్నీ పంపించి వేశాడు.

“ఏమ్మా, నీ పేరేమిటి?”

ఆమె వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. ఇన్‌స్పెక్టర్ రెండుమూడుసార్లు అడిగిన తర్వాత ఏడుపు ఆపుకుంటూ తన పేరు చెప్పింది.

"భయపడకుండా చెప్పు? రాత్రి ఏం జరిగింది?"

"మా ఆయన మూలుగు విని నాకు మెలకువ వచ్చింది. నేను కళ్ళు తెరిచి చూసేసరికి నెత్తురు మడుగులో వున్నాడు. కోడిగుడ్డు లైటు వెలుగులో చూశాను అదంతా. మంచం దగ్గర నిల్చున్నవాడు నేను లేవడం చూసి నా వైపు వచ్చాడు. నాకు భయంవేసి కేకలు పెట్టాను. కర్రతో నా తలమీద కొట్టాడు. నేను పడి పోయాను. తర్వాత నాకేం తెలీదు. తెలివి వచ్చేసరికి ఇక్కడున్నాను" తులసి చెప్పింది ఏడుస్తూనే.

"చూడమ్మా! కోడిగుడ్డు లైటు వెలుగుతూనే వుంది కదా అప్పుడు?"

"అవునండి!"

"అతని ముఖం నీకు కన్పించి వుంటుంది కదూ?"

"కన్పించిందండీ!"

"నువ్వు గుర్తుపట్టగలవా అతన్ని."

"కళ్ళకి నల్లటి గుడ్డ కట్టుకున్నాడండి. తలకి గూడా నల్లటి గుడ్డ వుంది. యెవరో గుర్తుపట్టలేకపోయాను."

"ఆకారాన్నిబట్టి యెవరో పోల్చగలవా? యెవరు చంపివుంటారు అతన్ని? మీమీద పగ యెవరికుంది? నీ అనుమానం చెప్పు?"

తులసి పెద్దగా ఏడ్చింది.

ఇన్‌స్పెక్టర్ అనునయించాడు.

"ఇంకెవరు చేస్తారు? ఆ సినిమా మేనేజర్ కాశీపతి చేసివుంటాడు. నేను అతనికి లొంగలేదని పగపట్టాడు. మా ఇంట్లోకి వచ్చి నన్ను బలవంతం చేశాడు. అడగటానికి వెళ్ళిన ఆయన్ని హాల్లో పట్టుకుని కొట్టాడు" అంటూ తులసి పాత కథంతా చెప్పింది.

"సార్! కాశీపతి చెప్పిన కథ వేరేగా వుంది" యస్.ఐ. అన్నాడు.

"ఫస్టు యూ గో ఇమీడియట్లీ. అరెస్టు హిమ్" సీరియస్‌గా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"యస్. సర్" సెల్యూట్ కొట్టి నిష్క్రమించాడు యస్.ఐ.

"చూడమ్మా! మీరీ వూరొచ్చి యెన్నాళ్ళయింది?"

"ఆర్నెల్లు."

"ఏ వూరు మీది?"

"తెనాలి."

"మీకు పెళ్ళయి యెన్నాళ్ళయింది?"

"సంవత్సరం దాటింది."

"అతనికి కావాల్సినవాళ్ళు యెవరైనా వున్నారా?"

"ఆయన అన్న వున్నాడు. కాని మమ్మల్ని రానివ్వడు. నన్ను చేసుకున్నాడని కోపంతో ఇంట్లోనుంచి వెళ్ళ గొట్టాడు."

"ఏం చేస్తాడు అన్న?"

"హోటల్ వుంది."

"నీ వాళ్ళెక్కడ వున్నారు?"

"నాకెవరూ లేరు. మా అమ్మ నాటకాలు వేసేది. చచ్చిపోయింది. నేనూ కొన్నాళ్ళు నాటకాలు వేశాను. ఆ వృత్తి నచ్చలేదు. ఆయన్ని పెళ్ళిచేసుకుని నాటకాలు మానేశాను."

"అయితే, ఆయన అన్నకి తెలియపరచవద్దా?"

"మీ ఇష్టం!"

"ఎంతయినా అన్నదమ్ములు. చివరిసారి చూడాలని

పిస్తుంది. అడ్రెస్ చెప్పు. తెలియజేస్తాము."

ఆమె చెప్పింది.

9

కాశీపతిని అరెస్టు చేసి బెయిల్ మీద విడుదల చేశారు.

సుబ్బారావు డెడ్ బాడీని తెనాలినుంచి వచ్చిన అతని అన్నకు అప్పగించారు. హోటల్ సిబ్బంది, కాకుల గుంట లాడ్జిలో కొందరు కలిసి శవాన్ని దహనం చేశారు.

సుబ్బారావు అన్న నెల్లూ తులసి చేతిలో రెండొందలు పెట్టి, అవసరమైతే వుత్తరం రాయమన్నాడు. తులసిని హోటల్ ప్రొప్రయిటర్ మురుగన్ భార్య ఇంటికి తీసి కెళ్ళింది.

ఇన్‌స్పెక్టర్ పోస్టుమార్టమ్ రిపోర్టు, డెడ్‌బాడీ ఫోటోలు, ఫింగర్ ప్రింట్స్ ముందేసుకుని కూర్చున్నాడు.

కాశీపతి చేతి వేలిముద్రలు యెక్కడా దొరకలేదు. కత్తి పిడిమీదగూడా ప్రింట్స్ లేవు. గ్లోవ్స్ తొడుక్కుని వుండొచ్చు. నెంబర్ టెన్ బూటు తొడుక్కున్న వాడు తిరిగినట్లుగా ముద్రలు పడ్డాయి. కాశీపతి బూటు తొమ్మిదో నెంబరు. యెక్కడా క్లూ దొరకలేదు. తులసి గూడా అతన్ని అనుమానిస్తున్నదే తప్ప, అతనే అని ఖచ్చితంగా చెప్పలేక పోతున్నది.

ఇన్‌స్పెక్టర్ కేసు గురించి డి.యస్పీతో మాట్లాడి సినిమా హాలుకి వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్‌కి విష్ చేసి ఆఫీసు రూమ్‌లోకి తీసికెళ్ళాడు కాశీపతి.

"చెప్పండి సార్!" అన్నాడు కాశీపతి. మనిషి నిబ్బరంగా వున్నాడు. భయపడుతున్నట్లు లేదు.

"సుబ్బారావు, తులసి గురించి మీకు తెలిసిన వివరాలు

చెప్పండి. వాళ్ళు ఈ వూరికి కొత్త. మీకు తప్ప విరోధులు యెవరూ లేనట్లు తెలిసింది. మీకు తెలిసిన గొడవలు వాళ్ళ గురించి ఏవైనా వుంటే చెప్పండి."

"సారీ సార్! నాకేం తెలీదు. తులసిని నా లైన్లోకి తెచ్చుకోవాలని ట్రైచేసినమాట నిజమే. తులసికి నాకూ సంబంధం వుంది. నలుగురికీ తెలిసినందుకే నన్ను షేమ్ చేసింది. అందుకు తులిసిమీద నాకేం కోపంలేదు."

"సుబ్బారావు అడ్డు తొలగించుకోవడానికి అతన్ని మర్డర్ చేయవచ్చుగా."

"తులసిని పర్మినెంట్గా కీప్ చేయాలని నాకేం లేదు. అటువంటప్పుడు అతను నాకు అడ్డు యేమిటి?"

"అయితే, ఈ హత్య యెవరు చేసివుంటారు?"

"ఆ విషయం నాకు తెలీదు."

"మీకేం తెలియదంటారు?"

"ప్రామిస్."

ఇన్స్పెక్టర్ జేబులోనుంచి నల్లటి పెన్తీసి టేబుల్ మీద పెట్టాడు.

"ఈ పెన్ మీదేనా?"

నల్ల పెన్చూసి కాశీపతి నివ్వెరపోయాడు. ఆశ్చర్యంగా చూశాడు ఇన్స్పెక్టర్ వంక.

"యెక్కడిది ఇది? మీకెలా వచ్చింది?"

"ముందు చెప్పండి. ఆ పెన్ మీదేనా?" ఇన్స్పెక్టర్ కంఠం కఠినంగా పలికింది.

"నాదే. దానిమీద నా పేరు వుంది."

"పేరు లేకపోతే నాది కాదని బుకాయించేవాడివి అవునా! మిస్టర్ కాశీపతీ! అది హత్య జరిగినచోట దొరికింది. తెలిసిందా!"

కాశీపతి నోట మాట రాలేదు కొంచెం సేపు.

"సార్! అది చాలా రోజుల క్రితం పోయింది."

"వెల్. ఆ విషయం కోర్టులో చెప్పండి."

ఇన్ స్పెక్టర్ ఆఫీసు రూమ్ నుంచి వెళ్ళిపోయాడు.

కొంచెం సేపటికి రిప్రజెంటివ్ భాస్కర్ రూమ్‌లోకి ప్రవేశించాడు.

కాశీపతి విచారంగా కూర్చుని వున్నాడు.

"ఈ పూట కలెక్షన్ పూర్ గా వుంది. హెచ్.ఓ. ఎఫ్. వచ్చేస్తుంది. ఫోన్ చేసి యన్ టీఆర్ ది కాని, కృష్ణది కాని స్టంట్ పిక్చర్ తెప్పించు. నెలాఖరుగదా మాస్ అయినా వస్తారు" అన్నాడు భాస్కర్.

కాశీపతి రిసీవర్ ఎత్తి నెంబర్ చెప్పి కాల్ బుక్ చేశాడు. అరగంట తర్వాత రింగైంది. ట్రంకాల్ మాట్లాడాడు. మధ్యలో మౌత్ పీస్‌కి చెయ్యి అడ్డంపెట్టి, "స్టంట్ పిక్చర్స్ ఏవీ లేవంటున్నాడు మీ మేనేజర్. యేం చెయ్యమంటావు" అని అడిగాడు కాశీపతి.

"అవి లేకపోతే లాభంలేదు. చార్టు బ్రేక్ చేస్తున్నానని చెప్పు. వేరే కంపెనీకి వెళ్ళు" అన్నాడు భాస్కర్.

కాశీపతి రిసీవర్ క్రేడిల్ చేశాడు. టెలిఫోన్ ఇండెక్స్ తీసి మరొక కంపెనీ నెంబర్ నోట్ చేసుకుని ట్రంకాల్ బుక్ చేసి కూర్చున్నాడు.

"రేపు లాస్టు డే గా!"

"వూఁ—" అన్నాడు కాశీపతి.

"నాకూ బోర్ గా వుంది మీ వూళ్లో. వచ్చి ఆర్నెల్లు

దాటింది" అన్నాడు భాస్కర్.

కాశీపతి మనసు యెక్కడో వుంది.

10

రెండు నెలలు గడిచాయి.

తులసి మురుగన్ ఇంట్లోనే వుంటోంది.

ఒకరోజు ఇన్‌స్పెక్టర్ రామస్వామిని కలుసుకుంది తులసి.

"నేను తెనాలి వెళ్ళిపోదామనుకుంటున్నానండీ. ఇక్కడ వాళ్ళింట్లో యెంతకాలం వుండను? కూరొండి తినాలంటే నాకు బాధగా వుంది" అంది తులసి.

"కేసు నడుస్తోంది. నీ సాక్ష్యం కావాల్సివస్తుందమ్మా! పిల్చినప్పుడు రావాలి. నీ అడ్రస్ ఎలా తెలుస్తుంది?"

"నేను మురుగన్ భార్య వళ్ళిగారికి ఉత్తరాలు రాస్తుంటాను. యెప్పుడు రమ్మంటారో ముందుగా ఆమెకు మీరు తెలియజేస్తే నాకు రాస్తుంది. లేదా ఆమె దగ్గర నా అడ్రస్ మారినప్పుడల్లా దొరుకుతుంది."

"నీ ఇష్టం. కాని నీ సాక్ష్యం చాలా ముఖ్యం సుమా! లేకపోతే కేసు గెలవకపోవచ్చు."

"కేసు గురించి నేను పెద్దగా ఆలోచించడంలేదు. ఆయన పోయాక కేసు గెలిస్తే మాత్రం ఏం లాభం?" బాధగా అంది తులసి. కళ్ళు తుడుచుకుంది.

ఆమె ముఖాన బొట్టు లేదు. తెల్లచీర కట్టుకుని దైన్యంగా కనిపిస్తోంది. చేతులకు రెండు రోల్డుగోల్డు గాజులు మాత్రం వున్నాయి.

ఆమె ఇన్‌స్పెక్టర్ దగ్గర సెలవు తీసుకుని వచ్చేసింది.

అక్కడ్నుంచి తెనాలికి డైరెక్టు బస్ లేదు. గుంటూరు బస్సు యెక్కింది.

మురుగన్, వళ్ళి బస్ వరకూ వచ్చి తులసికి వీడ్కోలు చెప్పారు.

ఇన్నాళ్ళూ తనను ఆదరించినందుకు కృతజ్ఞతలు చెప్పుకుని, కళ్ళనీళ్ళు పెట్టుకుంది తులసి.

ఇక్కడే వుండమంటే నువ్వు వినటంలేదు" అంది వళ్ళి.

"ఇష్టం లేకపోయినా నా వృత్తి నాకుందిగా. ఫరవా లేదు. కాలం గడిచిపోతుంది. పేలవంగా నవ్వింది తులసి.

సాయంకాలం ఐదు దాటింది.

బస్ బయల్దేరింది.

గుంటూరు చేరేసరికి తొమ్మిది దాటింది.

తులసి తెనాలి బస్ యెక్కలేదు.

నాన్ స్టాప్ బస్ యెక్కింది విజయవాడ వెళ్ళడానికి.

పదింటికి విజయవాడ చేరింది.

బస్ స్టాండ్‌లో దిగింది.

నల్లగా పొట్టిగా వున్న వ్యక్తి ఆమె దగ్గరగా వచ్చాడు.

"మీకోసం ఆటో రెడీగా వుంది" అన్నాడు.

"ఇల్లు దగ్గరేనా?"

"కాదు. మైలు వుంటుంది."

"పద" అంది ఆమె.

అతను సూట్ కేస్ అందుకున్నాడు.

పావుగంటలో ఆటో ఒక డాబాముందు ఆగింది.

ఆమె దిగి చుట్టూ చూసింది.

అది ప్రహారీ గోడతో ప్రత్యేకంగా వున్న డాబా!

నువ్వు వచ్చేదాకా నా మనసు మనసులో లేదు"

అన్నాడు లోపల్నుంచి వచ్చిన వ్యక్తి.

"భయం ఎందుకు?"

"ఏమో నాకే తెలీదు" నన్నాడు.

"భయపడితే ఏదీ సాధించలేం" అంది ఆమె.

"నిజమే."

"మన ప్రయాణం యెప్పుడు?"

"రేపు రాత్రి యేడుగంటలకి. టికెట్స్ రిజర్వ్ చేశాను."

"సర్లే" అందామె.

స్నానం చేసిరా. బ్యారేజి రెడీగా వుంది" అన్నాడు.

ఆమె బాత్ రూమ్‌లోకి వెళ్ళింది.

11

తులసి అప్పుడే స్నానంచేసి ఫ్రెష్‌గా కనిపిస్తోంది.

బచ్చలిపండు జార్జెట్ చీర, అదే రంగు బ్లౌజు వేసుకుంది. చేతిగాజులు అదే రంగు. యెడమచేతికి గోల్డు కవరింగ్ చైన్‌తో వున్న వాచీ వుంది. మెడలో సన్నటి బంగారు గొలుసుంది. రెండు జడలలో ఎర్ర గులాబీ లున్నాయి. నుదుట మామిడి జిగురు రంగు తిలకం మెరుస్తోంది. ముఖం పౌడర్‌తో మేకప్ చేసింది.

ఆమె చాలా సంతోషంగా వుంది. ముఖం ముద్ద మందారంలా కళకళలాడి పోతున్నది.

అతను సిమెంట్ కలర్ షర్టు, ప్యాంట్ వేసుకున్నాడు. హుందాగా కనిపిస్తున్నాడు.

ఇంటిముందు నీలం రంగు కారు ఆగివుంది.

అతను ఆమె దగ్గరగా వచ్చి "రెడీయా!" అన్నాడు.

"వూఁ...." అంది.

ఇద్దరూ వాకిట్లోకి వచ్చారు.

డ్రైవర్ డోరు తీశాడు.

కార్లోకి అడుగుపెట్టబోతున్నారు.

ఇంతలో సడన్‌గా పోలీస్ వ్యాన్ వచ్చి నీలంకారు ముందు అడ్డంగా ఆగింది. బిలబిలమంటూ పోలీసులు దిగి వారిని చుట్టుముట్టారు.

"మిస్టర్ భాస్కర్! యు ఆర్ అండర్ అరెస్టు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

హెడ్ కానిస్టేబుల్ అతని చేతులకు కవ్స్ తగిలించాడు.

భాస్కర్ వణికిపోతున్నాడు.

తులసి ముఖం ప్రేత కళ పడింది.

12

"సార్! నేను విన్నది కరెక్టేనా?" అంటూ హడావుడిగా రొప్పుతూ స్టేషన్‌లోకి వచ్చాడు కాశీపతి.

"ఏమిటా హడావుడి?" నవ్వుతూ ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ రామస్వామి.

"అదే సార్ మా రిప్రజెంటేటివ్ భాస్కర్ని, తులసిని అరెస్టు చేశారటగా."

"నిజమే మిస్టర్ కాశీపతి. సుబ్బారావుని హత్య చేసింది తనేనని భాస్కర్ ఒప్పుకున్నాడు. తులసి వాడికి సహాకరించింది. నీ పెన్ దొంగిలించి అక్కడ పడేసింది కూడా వాడే."

"అమ్మ నా కొడుకు. నా కొంప ముంచాడుగదా సార్! ఆ తులసి వెంబడి నేను పడుతుంటే అణాకాణీ వెధవ వాడి వెంట అది పడటం యేమిటి సార్ విచిత్రం? నాకేం అర్థంకావడంలేదు" అన్నాడు కాశీపతి.

"సినిమా గ్లామర్ నాయనా! వాడు దాన్ని సినిమా

హీరోయిన్ చేస్తానని ఆశ పెట్టాడు. అందుకు మొగుడు ఒప్పుకోలేదు. లాభం లేదని, వాడిని అడ్డు తొలగించారు. ఆ నేరం నీమీదకు నెట్టాలని ప్రయత్నించారు."

"నా మతి పోతోంది సార్! ఇదంతా మీకెలా కని పెట్టారు సార్?"

"పోలీస్ ఇన్‌స్పెక్టర్ని కాబట్టి" పకపకా నవ్వాడు రామస్వామి.

"చెప్పండి సార్! వాడిమీదకు మీ అనుమానం ఎలా వెళ్ళింది?"

"హత్య చేసింది మీరు కాదని నాకు మొదటే తెలుసు. యెందుకంటే నీ పెన్ తప్ప యే ఆధారం దొరకలేదు. కాని నీమీద కేసు పెట్టాం తప్పక.

తులసి మురుగన్ ఇంట్లో వున్నప్పుడు దానికొచ్చే లెటర్స్‌ని సెన్సార్ చేశాం. ఎవరో పేరు రాయకుండా ఉత్తరాలు రాస్తున్నాడు. ఆఖరికి దాన్ని వచ్చేయమని రాశాడు. ఫలానా రోజు, ఫలానా బస్సుకి రమ్మని.

మేము సి.ఐ.డి.ని పంపించాం తులసి వెంట. అక్క డున్నాడు మన కథానాయకుడు. వాడి దగ్గర దీని ఫోటో ఆల్బం, వగైరాలన్నీ దొరికాయి. నాలుగు తగిలిస్తే అసలు కథంతా బైటపెట్టాడు."

"థాంక్స్ ఇన్‌స్పెక్టర్! నన్ను కాపాడారు. నాకు ఉరిశిక్ష పడబోతున్నదని వూళ్ళో పెద్ద పుకారు. నా భార్య రోజూ యేడుస్తూ నా ప్రాణం తీస్తోంది సార్! మీ మేలు మరువలేను సార్!" ఇన్‌స్పెక్టర్ చేతులు పట్టుకుని వదల్లేదు కాశీపతి.

—: అయిపోయింది :—